క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మ కమలాలు



మామిడికుదురు: నగరం గ్రామంలోని పోలవరపు సత్యసాయిబాబా కుమారుడు పోలవరపు బాల కిశోర్ ఇంటి పెరట్లో ఒకటి కాదు రెండు కాదు పంచ పాండవులు లెక్కన అయిదు బ్రహ్మకమలాలు ఆదివారం రాత్రి విరబూశాయి. ఒకటి పూయడమే విశేషంగా భావించే స్థానికులు అయిదు పుష్పాలు ఒకేసారి వికసించడంతో వాటిని చూసి తన్మయత్వం చెందారు. బ్రహ్మ కమలాలకు భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత సీజ్‌లో 20 బ్రహ్మ కమలాలు విరబూశాయని బాల కిశోర్ తెలిపారు.

అప్పారావుకు ఐకాన్ పురస్కారం



ఐకాన్ పురస్కారాన్ని అందుకుంటున్న వెంకట అప్పారావు

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆదుర్తి వెంకట అప్పారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ 2025 పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత భవన్‌లో ఈ నెల 14న జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని తీసుకున్నారు. గత పదేళ్లుగా జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తల అభిమాన సంఘాలను నెలకొల్పి విద్యార్థులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆయా నాయకుల జీవిత చరిత్రలను తెలిపే 80 వేలకు పైగా కరపత్రాలను అప్పారావు సొంత ఖర్చులతో ముద్రించి అందరికి పంపిణీ చేశారు. విద్యార్థులతో ఆయా ప్రముఖుల జయంతులు, వర్ధంతులు నిర్వహించడమే కాకుండా అవగాహన కల్పించారు. వెంకట అప్పారావు చేసిన సేవలకు గాను ఐకాన్ పురస్కారం లభించింది. అప్పారావు పురస్కారం అందుకోవడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

ప్రజారోగ్యానికి కట్టుబడిన ప్రభుత్వం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: ప్రజల ఆరోగ్య పట్ల ప్రభుత్వం కృత నిశ్చయంతో కట్టుబడి ఉన్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం రాజోలు నియోజకవర్గంలో 36 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.33.58 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా ఏకతాటిపై కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, ఉండపల్లి అంజి, ఆకుల వెంకన్నాయుడు, చాగంటి స్వామి, రావూరి నాగు పాల్గొన్నారు.

ఘనంగా వనుములమ్మ తీర్థం

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామదేవతగా పూజలందుకుంటున్న వనుములమ్మ వారికి జాతర, తీర్థ మహోత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కమిటీ ఆధ్వర్యంలో యువత పంట పొలాల నుంచి తీసుకువచ్చిన రెండు తాళ్లను అమ్మవారి ఆలయం ఎదుట నిలబెట్టి పాతారు. ప్రత్యేక పూజలు అనంతరం తాళ్లలకు ఊయల వేసి అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి కానుకలు, మొక్కులు చెల్లించారు. అలాగే మండలంలోని తొత్తరమూడిలో మురుగులమ్మవారికి, మాగం కనకమహాలక్ష్మి, మరిడమ్మలకు సోమవారం జాతర, మంగళవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



విలసలో వనుములమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

సాగులో విత్తన ఎంపికే కీలకం

- నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి
- నేల స్వభావాన్ని బట్టి రకాలు ఎంచుకోవాలి
- వరి నారుమడి తయారీలో యాజమాన్య పద్ధతులు అవశ్యం



గత ఖరీఫ్‌లో కొత్తపేటలో కేళీల చేను పరిశీలిస్తున్న ఏడీ పద్మలత (ఫైల్)

కొత్తపేట: ఏ పంటకైనా మొట్టమొదటగా ప్రధానమైనది విత్తన ఎంపిక. నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయ అధికారులు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులను ముందస్తు సాగుకు సమాయత్తం చేసేందుకు కాలువలకు నీరు వదిలారు. నైరుతి రుతుపవనాలతో వర్షాలు పడుతుండడంతో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో రైతులు నారుమళ్ల తయారీకి ఉపక్రమిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో సార్వా సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు తమ భూముల స్వభావాన్ని బట్టి రకాలు సాగు చేసుకోవాలని, వరి నారుమడి నుంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవచ్చని వ్యవసాయ శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే మంచి రకాల ఎంపిక, నారుమడి తయారీ, విత్తనశుద్ధి, ఎరువులు, పురుగుమందుల వాడకం, నీరు, కలుపు నివారణలో యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని వివరించారు.

ఖరీఫ్ పంటకు అనువైన రకాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 140 రోజుల పంట రకం ఎంటీయూ–7029 (స్వర్ణ), 160 రోజుల రకం ఎంటీయూ–1318 వంటి గవర్నమెంట్ ఆధారిత రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. వినియోగదారులకు ఇష్టమైన 150 రోజుల పంట కాలం ఎంటీయూ 1262 (మార్టేరు మసూరి సన్నాలు), 140 రోజుల ఎంటీయూ 1224 (మార్టేరు సాంబ) రకాలు కూడా సాగు చేస్తున్నారు.

నమ్మకమైన విత్తనం కొనుగోలు చేసుకోవాలి

ప్రస్తుతం వరి విత్తనాలు 80 శాతం మేర రైతు నుంచి రైతు కొనుగోలు చేసుకుని సాగు చేస్తుండగా 20 శాతం ఏపీ సీడ్స్ (ఆర్ఎస్‌కే), ప్రైవేట్ డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. నమ్మకమైన రైతుల నుంచి విత్తనాలు సేకరించుకోవాలి. ప్రైవేట్ విత్తనాల షాపుల్లో కొన్నప్పుడు బిల్లు కచ్చితంగా తీసుకోవాలి. ఆ విత్తనం బ్యాగు భద్రపరచాలి. భౌతిక స్వచ్ఛత చూసుకోవాలి. మొలక కట్టుకోవాలి. నూటికి 80 గింజలు మొలక వస్తేనే మంచి నాణ్యమైన విత్తనంగా గుర్తించి వినియోగించాలి. ప్రైవేట్ డీలర్ల వద్ద ధాన్యం గోనె పట్టా విప్పి నమ్మకం కలిగితేనే వాడాలి. లేకుంటే తిరిగి ఇచ్చేయాలి. ఎందుకంటే గత ఖరీఫ్ సీజన్‌లో కొత్తపేట, ముమ్మిడివరం, ఐ.పోలవరం తదితర ప్రాంతాల్లో, గడచిన రబీ సీజన్‌లో చిరతపూడి తదితర ప్రాంతాల్లో అనేకమంది రైతులు ఒక వరి రకం విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయగా, వేరే రకాలు (కేళీలు) కలసి తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ అధికారుల చర్యలు తీసుకుని సంబంధిత కంపెనీ వారితో రైతులకు కొంతమేర నష్టపరిహారం ఇప్పించారు.

ఎకరానికి విత్తనాలు.. విత్తన శుద్ధి

వరినాటే పద్ధతిలో ఎకరానికి 20 నుంచి 25 కిలోలు, వెదజల్లు పద్ధతిలో ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల తెగుళ్ల అరికట్టడానికి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. విత్తనశుద్ధిలో ఒక లీటరు నీటిలో 10 గ్రాములు సూడోమోనస్ మందును కలిపి ఆ ద్రావణంలో ఒక కిలో విత్తనాల వంతున 36 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండి కట్టి మొలకవచ్చిన విత్తనాలను దమ్ము చేసిన నారుమడిలో చల్లుకోవాలి. 20 రోజులకు నారు తీసి నాటుకోవాలి. కోనసీమ ప్రాంతంలో వెదజల్లు పద్ధతి అంత అనుకూలం కాదు.

క్లస్టర్‌లో వరి విస్తీర్ణం

నియోజకవర్గం	- వరి విస్తీర్ణం (ఎకరాల్లో)
కొత్తపేట	29,560.09
పి.గన్నవరం	20,183.98
రాజోలు	7,777.35
మొత్తం	57,521.37

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి



విత్తనాలు సేకరించినప్పుడు, కొనుగోలు చేసినప్పుడు రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రైతుల నుంచి, ప్రైవేట్ డీలర్ల నుంచి తీసుకున్న విత్తనాల విషయంలోనే ఎక్కువగా సమస్యలు వస్తుంటాయి. గత సీజన్‌లో ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనంలో వేరే రకాలు కలిసి కేళీలు సమస్య వచ్చింది. అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని విత్తనాల డీలర్లకు సూచించాం. రైతులు కూడా విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

గ్రేడ్–1 ఏఎన్ఎంల బదిలీలు పూర్తి

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్–1 ఏఎన్ఎంలకు బదిలీలు పూర్తయ్యాయి. కాకినాడలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ బదిలీలు జరిగాయి. దీంతో మండలంలోని చింతలూరు, పెనికేరు, జొన్నాడ, చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం, మడికి, బడుగువానిలంక గ్రామాల్లో పనిచేస్తున్న గ్రేడ్–1 ఏఎన్ఎంలకు స్థానచలనం కలిగింది. అలాగే మండలంలో పెదపళ్ల, సంధిపూడి, మడికి, చెముడులంక గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్ఎంలకు పదోన్నతి లభించింది. ఆ మేరకు వారందరూ కాకినాడలో జరిగిన ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

పంట కాలువల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

ఆలమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు సాగునీటిని సక్రమంగా పారేందుకు వీలుగా పంట కాలువల వెంబడి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస చౌదరి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంట కాలువల్లో వ్యర్థాలు పారబోయడం వల్ల సాగునీరు కలుషితమవుతుందన్నారు. అలాగే ఎక్కడికక్కడ వ్యర్థాలతో సాగునీరు సక్రమంగా పారడం లేదన్నారు. ఇకనైనా కాలువ పరివాహక ప్రాంత ప్రజలు సత్వరమే స్పందించి ఆక్రమణలు తొలగించడంతో పాటు పంట కాలువను ఆహ్లాదకరమైన రీతిలో ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చింతాలమ్మ జాతర



చింతాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ దేవత చింతాలమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. ఆదివారం భక్తులు అమ్మ వారికి నైవేద్యాలు చెల్లించారు. సోమవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. మంగళవారం సిరిబాలమ్మ మహోత్సవం జరుగుతుందన్నారు. జాతర సందర్భంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చింతాలమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక కూటమి శ్రేణులతో కలిసి కత్తి తిప్పుడూ డ్యాన్సు చేసి సందడి చేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

సుపరిపాలన అందించిన మోదీ

సఖినేటిపల్లి: కేంద్రంలో 11 ఏళ్ల పాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందించారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంతర్వేదిలో పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కటికరెడ్డి గంగాధర్ పాల్గొన్నారు.

గురువును ఆశ్రయించినవాడే నిజమైన భక్తుడు

అయినవిల్లి: పరంపర ఆచార్యుడిని శుద్ధ గురువుగా కొలుస్తారు. అటువంటి మహావ్యక్తిని గురువుగా స్వీకరించినవాడే నిజమైన భక్తుడని, నల్లచెరువు అంతర్జాతీయ మందిర్ నిర్వాహకుడు ప్రభుజీ అన్నారు. ఆదివారం ప్రభుజీ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హరినామ సంకీర్తనలు, తులసి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

జస్వంత్ కుటుంబ సభ్యులకు పరామర్శ



జస్వంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన ఇసుకపట్ల జస్వంత్ ఎస్.యానం బీచ్‌లో గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం నేదునూరులోని జమీందార్‌పేటలో జస్వంత్ కుటుంబ సభ్యులను పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కనుమూరి సత్యనారాయణరాజు, కామన కృష్ణమూర్తి, కుడుపూడి సత్యనారాయణ, పేరిచర్ల రఘురాజు, బొంతు సత్తిబాబు, విప్పర్తి రమణ, వరశాల మధు, పెనుమాల దుర్గాప్రసాద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీ తాటిపాక
నూతన గ్రామ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ తాటిపాక గ్రామకమిటీ

రాజోలు: తాటిపాక గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాటిపాక స్థానిక కల్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు ఆధ్వర్యంలో తాటిపాక గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల శ్రీనివాసరావులతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా నియమించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో మంచి రోజులు వస్తాయన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నాయకులు పితాని రాంబాబు, మెడబల రాజ్‌కుమార్, మందపాటి మధు, కోటిపల్లి ఎస్తేరు రాణి, మద్దుల కాసు, బొంతు రమేష్, నామవరపు హనుమంతరావు, కనపాల బాబూరావు, పెమ్మాడి హరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం



ర్యాలిలో జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం చేస్తున్న పండితులు

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారి శ్రవణ నక్షత్ర మాస కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్యాత్మిక వ్యాఖ్యానం నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరపున ఈఓ రమణమూర్తి పట్టువస్త్రాలు సమర్పించగా, పలువురు భక్తులు కూడా పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ర్యాలి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తదుపరి మాస కల్యాణం వచ్చే నెల 13న జరుగుతుందని ఈఓ రమణమూర్తి తెలిపారు. భక్తులు అత్యధికంగా ఈ కల్యాణోత్సవంలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం గ్రామంలో వేంచేసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు, పోషకులు పాతపాటి రామాంజనేయరాజు, పాతపాటి వెంకటసత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి పవన్‌దీక్షితుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు పట్టువస్త్రాలు, కల్యాణ సామగ్రి, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆత్రేయపురం పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు గోరింట విజయ్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో కల్యాణ ఏర్పాట్లు చేసి, భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



నేదునూరులో సాయి స్రవంతి వైద్యులను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో అమలాపురానికి చెందిన సాయి స్రవంతి ఆసుపత్రి వారి సహకారంతో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సాయి స్రవంతి ఆసుపత్రి వైద్యులు 200 మందికి ఉచితవైద్య పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో టి.సాయిస్రవంతి ప్రసూతి స్త్రీలకు సంబంధించిన వైద్య సేవలందించారు. వైద్యులు యర్రంశెట్టి వి.రావు బీపీ, సుగర్, థైరాయిడ్ మొదలైన జనరల్ సమస్యలకు వైద్యం అందించారు. వైద్యుల వినీల్ చౌదరి వ్యాధులు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు మొదలైన సమస్యలకు వైద్యం అందించారు. వైద్యుల బృందాన్ని సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కళ్లేపల్లి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ కామన కృష్ణమూర్తి, పినిపే ఉమా మహేశ్వరరావు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో రావి ఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ, మెడికల్ ఇన్‌చార్జ్ జంగా నాగేశ్వరరావు, సభ్యులు అంగర శివ సాయిగౌడ్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పూర్వ తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అకీరా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని సంఘ అధ్యక్షుడు కాశి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కేటరాక్ట్ స్పెషలిస్టులు డాక్టర్ రవి, నారాయణరావు 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పలువురిని శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి యేడిద సత్తిరాజు, ఆర్థిక కార్యదర్శి ఆర్ఎస్ బ్రహ్మానందరావు పాల్గొన్నారు.

రైతులంతా ఈ–కేవైసీ చేయించుకోవాలి

అయినవిల్లి: అన్నదాతా సుఖీభవ పథకం కోసం అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా వేలిముద్రలు వేసి ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.శోభ అన్నారు. అయినవిల్లి రైతు సేవా కేంద్రంలో ఆదివారం ఆమె రైతులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఈ–కేవైసీ నమోదు చేస్తున్నారన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలిముద్రలు వేయడం ద్వారా ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. స్థానికంగా పొలాలు కలిగి ఉండి ప్రస్తుతం అందుబాటులో లేనివారు తమకు సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కూడా ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, సెల్‌ఫోన్ నంబర్ల ద్వారా ఈ–కేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఈ–కేవైసీ లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాతా సుఖీభవ పథకం డబ్బులు పడటంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతు సేవా కేంద్రం వీఏఏ దుర్గచక్రం, నేదునూరు వీఏఏ మోహన్ సిరిపల్లి రైతు సేవా కేంద్రం వీఏఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11,500 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన పూరి సరస్వతి(50) సుగర్ బాగా ఎక్కువై కాలి పాదం కింద గాయం ఇన్ఫెక్షన్‌కి దారి తీసి కొంత భాగం తొలగించారు. ఇంకా ఇంటి దగ్గర వైద్యం చేయించుకోవాలి. సరస్వతి భర్తకి అంత ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు రావులపాలెంలో సరస్వతి ఇంటికి వెళ్లి రూ.11,500 చెక్కును అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. భారీ క్యూలైన్‌లో వెళ్లి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదానంలో సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కాగా స్వామి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శన టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,01,512 ఆదాయం, అన్నదాన ట్రస్టుకు విరాళాల ద్వారా రూ.84,224 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ పేర్కొన్నారు.



అంతర్వేది ఆలయంలో క్యూలో వెళుతున్న భక్తులు

ఉద్యోగుల సేవలు మరువలేనివి



రామరాజులంక సీఈఓ నారాయణరావు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మలికిపురం: ఉద్యోగుల సేవలు మరువలేనివని, జీవితంలో రైతులకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రామరాజులంక సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. రామరాజులంక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేశినీడి భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన పీఏసీఎస్ సీఈఓ దేశినీడి నారాయణరావు ఉద్యోగ విరమణ సన్మాన సభలో పలువురు వక్తలు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామ పురజనులు, సహకార సంఘాల యూనియన్ సభ్యులు, సహకార ఉద్యోగులు, డీసీసీ బ్యాంక్ శాఖల మేనేజర్లు, సిబ్బంది నారాయణరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో రామరాజులంక సొసైటీ మాజీ అధ్యక్షుడు బొరుసు ఉమామహేశ్వరరావు, దిరిసాల బాలాజీ, గంటా నాయుడు, ముద్దల శ్రీను, సహకార ప్రత్యేక అధికారి మురళీ సత్యనారాయణ, ఆడిటర్ శ్రీనివాస్, మేడిచర్ల వీరవేంకట సత్యనారాయణమూర్తి, చొప్పల రాజేశ్వర రావు, మేడిచర్ల సూర్య ప్రకాశరావు, ఓదూరి నాగ ప్రసాద్, మాజీ సర్పంచ్ బొరుసు సుబ్బారావు, చింతా రాజబాబు, నల్లి శివకుమార్, మాజీ సెక్రటరీ ముద్దల రామకృష్ణారావు, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్ కావలెను..



అంబాజీపేట పశువైద్యశాల

అంబాజీపేట: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో పశువులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. సమస్యలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమే కదా అన్న చిన్నచూపో, ఎవరూ అడిగేవారు లేరన్న నిర్లక్ష్యమో కాని అంబాజీపేట పశు వైద్యశాలకు డాక్టర్‌ను కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది. ఇక్కడ విధులు నిర్వహించే పశువైద్యాధికారి పదోన్నతిపై ఈ ఏడాది ఫిబ్రవరిలో వెళ్లిపోయారు. అప్పటి నుంచి నేటి వరకు పుల్లేటికుర్రు వైపువైద్యాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రమైన అంబాజీపేటలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పశువైద్యశాలకు అంబాజీపేట, మాచవరం, నందపూడి, తొండవరం, వాకలగరువు, ఇసుకపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల రైతులు వినియోగించుకుంటారు. ఇన్‌చార్జులను కాకుండా రెగ్యులర్ వైద్యుడిని కేటాయించాలని పాడి రైతులు కోరుతున్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి



అయినవిల్లిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యాన స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. స్వామివాని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏకాదశ, లఘున్యాస అభిషేకాల్లో 40 మంది పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 23 జంటలు, పంచామృతాభిషేకాల్లో 5 జంటలు పాల్గొన్నాయి. ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆరుగురు చిన్నారులకు తులాభారం, ముగ్గురు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఐదుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 28 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2,750 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజా టికెట్లు, అన్నదాన విరాళాల ద్వారా స్వామికి రూ.2,35,368 ఆదాయం లభించిందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ, ఏసీ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.